

సాహితీ తపస్వి పుత్తా పుల్లారెడ్డి

కడప అర్బన్ :సాహితీ తపస్వి పుత్తా పుల్లారెడ్డి అని శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు రిటైర్డ్ ఆచార్యులు, ఆచార్య శలాక రఘునాథ శర్మ (రాజమండ్రి) అన్నారు. 'భారత భారతి' పుత్తా పుల్లారెడ్డి రచించిన 'మహాభారత విజ్ఞాన సర్వస్వం శ్రీశ్రీవేంకటసుబ్బార్యం' పుస్తకావిష్కరణ సభను ఆదివారం ఉదయం ఐఎంఎ హాల్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, ఇంజినీర్ పుత్తా వెంకట సుబ్బారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ శర్మ మాట్లాడుతూ తెలుగు భారతాన్ని పలుమార్లు చదివిన పుత్తా పుల్లారెడ్డి దాని ఆధారంగా అనేక గ్రంథాలు రచించారని చెప్పారు. ఇంజినీరుగా ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సాహిత్య క్షేత్రంపై దష్టి సారించి సాహితీ సంస్థలు, విశ్వవిద్యాలయాలు చేయాల్సినపనిని ఆయన ఒక్కరే చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు బి.శ్రీమన్నారాయణ రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం (విశాఖపట్టణం), మహాభారత కంటకోద్ధారకర్త గరిమెళ్ళ సోమయాజులు శర్మ (విజయవాడ), పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చేరువ చేయడమే ధ్యేయం

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దిరాజు వెల్లడి

సామాన్యుల లోగిళ్లలోనికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. వైఎస్‌ఆర్ పెన్షన్ దగ్గర నుంచి సుమారు తొమ్మిది సంక్షేమ పథకాలను అర్హులైన వారికి చేరువ చేస్తున్నాం. సమాజంలోని వేళ్లూనుకుపోయిన జెండర్ వివక్షను రూపుమాపడంపై దృష్టి సారించాం. ఈనెల 23 నుంచి డిసెంబర్ 23 వరకు వర్క్‌షాపుల నిర్వహణ ద్వారా మహిళా వివక్షను రూపుమాపడంపై అవగాహన కల్పించడానికి తోడ్పాటు నందిస్తున్నాం. జిల్లాలో వేంపల్లి, పోరుమామిళ్ల, ఖాజీపేట సహా 15 ప్రాంతాల్లో మహి ళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వ్యవసాయ అనుబంధ విభాగమైన మల్బరీ సాగుకు, చేనేతలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. లైవ్‌స్టాక్స్ ద్వారా యువతకు రుణాల మంజూరు రూపంలో పౌల్ట్రీ మొదలుకుని గొర్రెలు, బర్రెల సదుపాయాల కల్పన ద్వారా మెరుగైన జీవనోపాధుల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నామని చెబుతున్న డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దిరాజును ప్రజాశక్తి కలిసిన సందర్భంగా ఆయనతో ముఖాముఖి...

-ప్రజాశక్తి- కడప ప్రతినిధి



ముఖా ముఖి..

సంక్షేమ పథకాలను గురించి తెలపండి?

జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) పరిధిలో వైఎస్‌ఆర్ కానుక, వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ సున్నావడ్డీ, వైఎస్‌ఆర్ చేయూత, జగనన్నతోడు, బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, హౌసింగ్ రుణాలతో కూడిన తొమ్మిది సంక్షేమ పథకాలను అందిస్తున్నాం.

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక లక్ష్యాన్ని వివరించండి?

సమాజంలో వృద్ధులకు ఆర్థిక ఆసరాను అందించడం ద్వారా వృద్ధుల జీవితాల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నాం. జిల్లాలోని వృద్ధులు మొదలుకుని వికలాంగులు, చెవుడు, ఒంటరి మహిళలతోపాటు వివిధ కేటగిరీల కింద 2,51,277 లబ్ధిదారులకు రూ.64.12 కోట్లను అందజేస్తున్నాం. ప్రతి నెలా ఒకటి నుంచి ఐదవ తేదీలోపు వృద్ధుల ఇళ్ల దగ్గరికి వెళ్లి పెన్షన్ అందించే ప్రయత్నం చేయడంలో సఫలీకృతులమయ్యాం.

వైఎస్‌ఆర్ ఆసరా గురించి తెలపండి?

వైఎస్‌ఆర్ ఆసరా పథకం మొదటి విడత కింద 21,058 మందికి రూ.171 కోట్లను అందజేశాం. రెండు విడత కింద 22,984 మంది లబ్ధిదారులకు రూ.174 కోట్లు పంపిణీ చేశాం.

వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ అమలు గురించి చెప్పండి?

వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం సక్రమంగా అమలవుతోంది. మొదటి విడత కింద 22,228 మంది లబ్ధిదారులకు రూ.56.51 కోట్లను ఖాతాల్లో జమ చేశాం. రెండవ విడత కింద 25,169 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.48.27 కోట్లను జమ చేశాం. మూడవ విడత కింద 33,057 మంది లబ్ధిదారులకు రూ.169 కోట్లను జమ చేశాం.

వైఎస్‌ఆర్ చేయూత అమలు గురించి వివరించండి?

వైఎస్‌ఆర్ చేయూత పథకాన్ని 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన మహిళలకు అందజేయడం జరుగుతోంది. జిల్లాలో మొదటి విడత కింద 77,550 మందికి రూ.145 కోట్లు అంద జేశాం. రెండవ విడత కింద 81,286 మందికి రూ.152 కోట్లు, మూడవ విడత కింద రూ.90,369 మందికి రూ.169 కోట్లు వెరసి మొత్తం రూ.467 కోట్లు పంపిణీ చేయడమైంది.

వైఎస్‌ఆర్ బీమా పథకం అమలు ఎలా ఉంది?

వైఎస్‌ఆర్ బీమా పథకం ప్రమాదాల బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడమే ధ్యేయంగా ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 456 పేర్లను రిజిస్ట్రేషన్ చేయడమైంది. ఇందులోని 17 బాధిత కుటుంబాలను ఆదుకున్నాం. ప్రతి బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల చొప్పున రూ.85 లక్షలు పంపిణీ చేశాం. మిగిలిన వాటిని పరిశీలన చేసి త్వరలో పరిహారం అందించే ప్రయత్నం చేస్తున్నాం.

'జగనన్నతోడు' తీరుతెన్నుల గురించి తెలపండి?

జిల్లాలో జగనన్నతోడు పథకం కింద చిరు వ్యాపారులను ప్రోత్సహిస్తున్నాం. ఒక్కో వ్యాపారికి రూ.10 వేల చొప్పున రుణాలను అందజేశాం. ఇందులోభాగంగా 9,200 మందికి రూ.92 కోట్లను పంపిణీ చేశాం.

స్త్రీ నిధి గురించి చెప్పండి?

స్త్రీనిధి మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందించడంలో భాగంగా ఏర్పడింది. ఇందులోభాగంగా రూ.19,899 మంది మహిళలకు రూ.99 కోట్లను పంపిణీ చేయడమైంది. ఉత్సాహవంతులైన మహిళలు సంయుక్తంగా షేర్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేసుకుని మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ముందుకు వెళ్తున్నారు. జిల్లాలోని 15 ప్రాంతాల్లో మహిళా మార్ట్‌ల ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఖాజీపేటలో మొదటి సారిగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రొద్దుటూరు ఏరియాలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలన చేస్తున్నాం.

జగనన్న ఇంటి రుణాల గురించి తెలపండి?

జిల్లాలో జగనన్న ఇంటి రుణాల లభ్యత సజావుగా సాగుతోంది. జిల్లాలో హౌసింగ్ స్కీమ్‌కు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 19,500 హౌసింగ్ లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున రూ.49 కోట్ల వరకు చెల్లింపులు చేశాం. సామాన్యుల జీవనోపాధుల మెరుగుదలకు గొర్రెల, బర్రెలు, పౌల్ట్రీ ఏర్పాటుకు రుణ సదుపాయాలతోపాటు పట్టు పరిశ్రమ, చేనేత వంటి సామాజిక వృత్తులకు తోడ్పాటును అందించే ప్రయత్నం చేస్తున్నాం.

అన్ని పంటలకూ ఉచిత బీమా అమలు చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్ని పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్టాండ్‌లోని రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగితాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని పేర్కొన్నారు. జిల్లాలో వేరుశనగకు మాత్రమే పంటల బీమా అమలు చేశారని, పత్తి, వరి ప్రధానంగా ఉన్నాయని, వీటికీ ఉచిత బీమా అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ పంటల బీమా అన్ని పంటలకు కల్పించాలని తెలిపారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాల్లో చేతికి వచ్చిన వరి ధాన్యాన్ని ఇంతవరకు ఆర్‌బికెలలో కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే నిబంధనలను సడలించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర దక్కాలంటే రైతు భరోసా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేయాలని తెలిపారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క చెబుతోందని, అది కేవలం ప్రకటనలకే పరిమితం అయిందని విమర్శించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, తరుగు వస్తుందని ఆర్‌బికెలలో ఇప్పుడే కొనుగోలు చేయలేమని చెప్పడం సరికాదని చెప్పారు. నిబంధనలను సడలించి చేతికొచ్చిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.2060 ఉందని,బహిరంగ మార్కెట్లో కింటా రూ.1750 తో ప్రయివేట్ వ్యాపారులకు రైతులు విక్రయిస్తున్నారని తెలిపారు. తద్వారా క్వింటాపై రూ.300 రైతులు నష్టపోతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పేర్లు నమోదు చేసుకోవడానికి, విక్రయించడానికి ముందుకు రావడంలేదని చెప్పారు. రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వం ప్రకటించిన వాతావరణ పంటల బీమా లో పత్తి, వరి పంటలను చేర్చాలని కోరారు. వ్యవసాయ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 12 శాతం విధించడం సరైంది కాదన్నారు. రైతాంగ సమస్యలపై రానున్న కాలంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకష్ణయ్య, దస్తగిరిరెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, పుల్లయ్య, చిన్న సిద్దయ్య, వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



ఐక్యతను చాటుతున్న నాయకులు

సిఎం మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటనిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, మనోమర్ డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 25వేల మంది విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేసుకుని రెగ్యులర్ చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకుని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021 విద్యుత్ చట్ట సవరణ బిల్లులను ఉపసంహరించుకోవాలని చెప్పారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15న నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఎస్‌పిడిసిఎల్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, డిస్కం సహాయ కార్యదర్శి కె.సురేష్‌బాబు, మైదుకూరు డివిజన్ అధ్యక్షులు పి.సి.కొండయ్య, రాయచోటి అధ్యక్షులు శ్రీనివాసులు, కడప అధ్యక్షులు కేశవ, హరి, ప్రొద్దుటూరు నాగరత్నచారి, బద్వేల్ కార్యదర్శి శేషయ్య, ట్రాన్స్‌కో నాయకులు గురుప్రసాద్, జయచంద్రరెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా నాయకులు కొండారెడ్డి, రామకృష్ణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మీటర్స్ రీడర్స్ నాయకులు భద్ర, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

మానవహక్కుల పరిరక్షణకు కృషి

కడప అర్బన్ : మానవ హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని హెచ్‌ఆర్‌సిసిఐ జాతీయ చైర్మన్ ఎస్.వి రమణయ్య అన్నారు. ఆదివారం ప్రకాష్ నగర్‌లోని హెచ్‌ఆర్‌సిసిఐ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర, జిల్లా కమిటీలను నియమించి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా మానవహక్కుల ఉల్లాంఘన జరిగితే అక్కడ తమ సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. సంస్థ సభ్యులపై ఆరోపణలు వస్తే విచారించి వాస్తవమైతే తక్షణమే తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్యామ్, ఇరువూరి సుబ్బారావు, రాజారావు, శ్రీరాములు, మైనార్టీ నాయకులు షఫీ అహమ్మద్, నారాయణస్వామి, జడ కొండయ్య, ప్రవీణ్‌కుమార్, ప్రవీన్, ప్రసన్న కుమార్, సురేష్, కె..పి.ప్రవీణ్, వి.ఎస్.ముస్తాక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే పోరాడాలి

కడప అర్బన్ : ప్రభుత్వాలు సమస్యల పట్ల స్పందించకపోతే పోరాటాలు చేయక తప్పదని కమలాపురం ఎంఎల్‌ఎ పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనివాస రెసిడెన్సీలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ లోగో, జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ చర్చల ద్వారా పరిష్కారం కానప్పుడు మాత్రమే ఆందోళన బాట పట్టాలని పేర్కొన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనేక ఉపాధ్యాయ సంఘాలు చంద్రబాబు దిశా, నిర్దేశంతో పని చేయడం బాధాకరమని చెప్పారు. ఎంఎల్‌సి కల్పలతారెడ్డి మాట్లాడుతూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటే ఎలాంటి నష్టం ఉండదన్నారు. అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎంఎల్‌సిగా గెలిపిస్తే ప్రభుత్వంతో మాట్లాడి ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరి ష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ రవీంద్రనాథరెడ్డి

చర్చి వద్ద ఫుడ్ కోర్టు వద్దు

కడప అర్బన్ : నగరంలోని అక్కాయపల్లెలో ఉన్న మరియాపురం చర్చివద్ద ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయవద్దని చర్చి ఫాదర్ బిరుసు రాజ కోరారు. ఆదివారం ఫుడ్ కోర్టు వద్ద ఫ్ల కార్డ్స్‌తో నిరసన తెలిపారు. కార్పొరేషన్ వారు చర్చి స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా కట్టడాలు నిర్మించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని చెప్పారు. వెంటనే నిర్మాణాలు ఆపాలని కోరారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

బైబిల్‌ను కాల్చడం దారుణం

కడప :తాడిపత్రిలో ఈనెల 24న కొందరు బైబిల్‌ను కాల్చడం దారుణమని పాస్టర్ పి.మహేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బైబిల్ ను కాల్చిన వారిని చట్టాలు క్షమించవని, వారిపై ప్రభుత్వం, పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్ద పి.పిలిప్పి, విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, రోజా, లీలావతి, సుగుణమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

కడప : ఆశారేఖ వ్యవస్థాపక అధ్యక్షురాలు నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు కడప నగరంలో వినూత్న పద్ధతిలో రంగోలి కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య అవగాహన కల్పించే ప్రయత్నంగా కళాకారులు కళ్యాణ్, ప్రేమ్ బృందం వినూత్నంగా రోడ్డుపై వేసిన కళాకృతికి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమం చేయడం పట్ల మున్సిపల్ కమిషనర్ అభినందనలు తెలిపారు.

16 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

49 దుంగలు స్వాధీనం - ఎస్‌పి అన్బురాజన్ వెల్లడి

ప్రజాశక్తి - కడప అర్బన్

బి.మఠం మండలం, మైదుకూరు-బద్వేల్ రహదారిలో ఉన్న రాణి బావి వద్ద ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న 16 మంది స్మగ్లర్లను పోలీసుల అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ జోన్, మైదుకూరు డిఎస్‌పి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6గంటలకు లంకమల్ల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలుగా మార్చి వేరే ప్రాంతానికి తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఐచర్ లారీ, రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మొద్దులు లోడ్ చేస్తున్న స్మగ్లర్లు వెల్లియన్ దశరదా, చెంద్రయాన శేతు, పూచ్ స్వామికాన్, అర్జున్ స్వామినాధన్, పాకం శ్రీనివాసులు, అన్నామలై శేఖర్, తంగవేల్ సత్యరాజ్, చిన్నతంబి సెల్వరాజ్, ధర్మన్ వడివేల్, అండికాస్, ముర్గేషన్ అజకురాజ్, అన్నామలై సెల్వరాజ్, పెచ్చన్ కమల కన్నన్, ఎల్లా అంకయ్య, జంపంగి నవీన్ కుమార్‌ను అరెస్టు చేశారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 49 ఎర్రచందనం దుంగలు, ఐచర్ వాహనం, రెండు కార్లు, 8 సెల్ ఫోన్లు, 3 రంపాలు, 5 రాళ్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎర్రచందన దుంగలు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని పిడి యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభచూపిన ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, మైదుకూరు డిఎస్‌పి వంశిధర్‌గౌడ్, సిఐలు నాగభూషణం, ఆర్‌ఎస్‌ఐ పోతు రాజు, హనుమంతు నాయక్, బద్వేల్ రూరల్ సిఐ నరేంద్ర రెడ్డి, మైదుకూరు రూరల్ సిఐ మోహన్‌రెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డి, గోపవరం ఎస్‌ఐ చంద్రశేఖర్, బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్, మైదుకూరు అర్బన్ మద్దిలేటి, రవికుమార్, సిబ్బదిని ఎస్‌పి అభినందించారు.



దుంగలను పరిశీలిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

హత్య కేసులో భర్తే నిందితుడు : సిఐ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక ఇందిరా నగర్‌లో ఈనెల 23న మృతిచెందిన లక్ష్మీదేవి హత్య కేసులో ఆమె భర్త బాల నరసింహులే నిందితుడని కడప రూరల్‌సిఐ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో నిందితుడు తన భార్యతో గొడవపడ్డాడని తెలిపారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన అతను ఆమెను బలంగా తోయడంతో ఆమె కిందపడి తలకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఆ వెంటనే ఆమె గొంతు నులిమి బలంగా నేలకేసి పలుమార్లు కొట్టి హత్య చేశాడని చెప్పారు. తరువాత సాక్ష్యాలను చేరిపేసి యధావిధిగా ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లాడని చెప్పారు. సాయంత్రం ఇంటికి వచ్చి ఏమీ జరగనట్లు తన భార్య కిందపడి స్పృహ కోల్పోయినట్లు తన కుమారుడిని, అందరినీ నమ్మించాడని పేర్కొన్నారు. చుట్టుపక్కలవారి సాయంతో ఆటోలోనే లక్ష్మీదేవి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించగా అక్కడి వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారని చెప్పారు. మరుసటి రోజు 24న గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి డిఎస్‌పి వెంకటశివారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు విచారించారని చెప్పారు. తాను దొరికితే ఇబ్బంది వస్తుందని భావించి ఈనెల 26న అతనే ఆర్‌ఐ వద్దకు వెళ్లి తన భార్యను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. ఆర్‌ఐ నిందితుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారని సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పెండ్లి మర్రి ఎస్‌ఐ రాజ రాజేశ్వర్ రెడ్డి, వల్లూరు ఎస్‌ఐ విష్ణువర్ధన్, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐ అశోక్‌రెడ్డి

సంఘం గౌరవ అధ్యక్షులుగా ఆవుల బసిరెడ్డి

ప్రజాశక్తి- చెన్నూరు

ఆది గాయత్రి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం గౌరవ అధ్య క్షులుగా పేదల నిస్వార్థ ప్రజా సేవకుడు ఆవుల బసిరెడ్డిని ఆ సంఘం అధ్యక్షులు వాసం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘ సభ్యులందరూ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆవుల బసిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని నిరుపేద వికలాంగుల అభివృద్ధితోపాటు వారి అభ్యున్నతికి, వికలాంగుల సంక్షేమ సంఘానికి తన వంతు సహాయ సహకారాలను అందించడానికి శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు కంటి పొరకు సంబంధించి ఆపరేషన్లను ఉచితంగా శంకర నేత్రాలయ వైద్యశాల, టంగుటూరు చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం అనంతరాజు పల్లె గ్రామంలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు ఉచిత శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కె.చిన్న వెంకటసుబ్బయ్య, గౌరవ సలహాదారుడు చింతకుంట మహేశ్వర్ రెడ్డి, కార్య వర్గ సభ్యులు రెడ్డిప్రసాద్, రామాయణం రామకృష్ణ, వికలాంగుల, సభ్యులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని సాయిపేట మున్సిపల్ హైస్కూల్‌లో పదవతరగతి చదివిన 1992 విద్యార్థుల పూర్వపు కలయిక ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రమేష్ మాట్లాడుతూ 3 దశాబ్దాల తరువాత కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాజ ప్రకాష్, ఇబ్రహీం, సుబ్బారావు, సుబ్బమ్మ ప్రోత్సాహంతో 46 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఐదుగురు ఉపాధ్యాయులను సన్మానించారు.

మోడల్ స్కూల్‌లో వసతులు నిల్

- ఇబ్బందుల్లో విద్యార్థులు - పట్టని అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌లో వసతులు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ఆంగ్లంలో విద్యను బోధించేలా మోడల్ పాఠశాలను నరసాపురంలో ఏర్పాటు చేసింది. వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా వంటశాల లేక పదేళ్ల నుంచి వంట ఏజెన్సీలు ఇబ్బందులు పడుత న్నారు. అమగంపల్లి నుంచి ఇటుకలపాడు, కోడిగుడ్లపాడు మీదుగా మోడల్ పాఠశాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రహరీ నిర్మాణం నేటికి పూర్తి కాకపోవడంతో విద్యార్థులుఅనేక ఇబ్బందులు పడుతున్నారు. 400 మంది విద్యార్థులకు ఆట స్థలం లేక క్రీడల్లో వెనుకబడిపోతున్నారు. ఇప్పటికైనా జిలా ఉన్నతాధికారులు స్పందించి మోడల్ స్కూల్‌కు కనీస వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు యథాతథంగా స్పందన

కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 28న 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని కలెక్టర్ తెలిపారు.

నేడు ఎన్నికల పరిశీలకులు రాక

కడప : మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ఎన్నికల పరిశీలకులు (రోల్ అబ్జర్వర్) పిఎస్ ప్రద్యుమ్న ఈ నెల 28న జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓటరు ప్రత్యేక సంక్షిప్త సవరణ -2023 కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వాహన పత్రాలపై అవగాహన

కడప : నగరంలోని మహావీర్ సర్కిల్‌లో ఆదివారం శాంతి సేవ సొసైటీ సభ్యులు అయ్యారి రమేష్ బాబు, మడగలం మనోహర్ లు వాహనదారులకు పుష్పాలను అందించి వాహన పత్రాలు తప్పనిసరి కలిగి ఉండాలని, వాహన పత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాబు లింగమయ్య, స్రవంతి, అమృత, పావని, నీలమ్మ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి కంచమ్మ, సరస్వతమ్మ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి ఆదివారం నగరంలోని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంస్థ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కార్యదర్శి వి.గౌరిశంకర్, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, శ్రీనివాసులు, దేవతి రవి, చింటు, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దుప్పటి పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

కేసు నమోదు చేయండి

కడప అర్బన్ :ఫ్యాక్షన్ ఉంటే చంద్రబాబును, లోకేష్‌ను టార్గెట్ చేసేవారమంటూ వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి వారు పోస్టు చేసే వెంటనే అరెస్టు చేసే పోలీసులు చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ఇంటలిజెన్సి బ్యూరో చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు జిలానీబాష పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

కడప :అన్ని దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్, ఎన్‌సిసి అధికారి లెఫ్ట్‌నెంట్ డాక్టర్ నీలయ్య అన్నారు. ఆదివారం ఎన్‌సిసి ఆవిర్భావించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి, రక్తహీనతతో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా పునర్జన్మ కల్పించవచ్చని అన్నారు. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీ కళాశాల ఎన్‌సిసి అధికారి అనంతరెడ్డి, ఇమామ్ ఖాసిం, కేడెట్లు. విద్యార్థులు పాల్గొన్నారు. **ఎన్‌సిసి కేడెట్ల డైమండ్ జూబ్లీ వేడుకలు** మున్సి పల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌నందు ఎన్‌సిసి కేడెట్లు డైమండ్ జూబ్లీ డేకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా డిఇఒ దేవ రాజు హజరై మాట్లాడారు. ప్రతి కేడెటూ సమాజ సేవలో ముందుండాలన్నారు. అనంతరం ఆయన ఎన్‌సిసి అధికారి పి.వి. సుబ్బారెడ్డిని ప్రధానోపాధ్యాయురాలు పి. నాగమణితో కలిసి సన్మానించారు. ఎస్‌కె డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి కేడెట్లు రక్తనిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు.



రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి కేడెట్

ప్రభుత్వ ప్లీడర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప

కడప కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ ప్రభుత్వ ప్లీడర్‌గా ఉద్యోగోన్నతి పొందిన పి. శివశంకర్‌రెడ్డిని, ఆయన పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం సన్మానించారు. కడప ఫకీరు పల్లెలోని న్యాయవాది స్వగృహంలో దుశ్యాలువతో, పూలమాలలతో సత్కరించారు. అనంతరం మిత్రులు నీలి శ్రీనివాసరావు, హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శివశంకర్‌రెడ్డి సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, స్వశక్తితో మంచి లాయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో మిత్రులు సత్యనారాయణ, రెడ్డిభాస్కర్, నిత్య, రవి, రమణ, మురళీమోహన్‌రెడ్డి, పెంచలయ్య, బాబు, హరి, లింగమయ్య, ఖాదర్, చంద్రశేఖర్, ఇస్మాయిల్, బాల మురళీకృష్ణ, శ్రీనివాసులు, గౌస్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, మల్లయ్య, నాగభూషణం, శేఖర్ పాల్గొన్నారు.



ప్లీడర్‌ను సన్మానిస్తున్న మిత్రులు

బదిలీ ఉద్యోగులకు...

ఒంటిమిట్ట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగోన్నతలు పొందిన వారిని ఆదివారం తహశీల్దార్ సన్మానించారు. సాలాబాద్ రెవెన్యూ పరిధిలో విఆర్‌ఒగా పనిచేస్తున్న మామిడి ప్రశాంత్ ఇరిగేషన్ ఎఇగా, ఎఆర్‌ఐగా పనచిస్తున్న వేణుగోపాల్ చింత కొమ్మదిన్నెకు బదిలీ అయ్యారు. వారిని తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలి కారు. వీరిద్దరూ అంకిత భావంతో ప్రజా సేవ చేశారన్నారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి జనార్దన్ రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ అకేపాటి వేణుగోపాల్ రెడ్డి, మాధవరం ఎంపిటిసి బోగా గీత దేవి, వైసిపి నాయకులు బొడ్డే రమణ, సుబ్బారెడ్డి, మాధవరం సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, అధికారులు , వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి


ఒంటేరుకు మద్దతు

కడప అర్బన్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున తెలిపారు. ఆదివారం ఆర్‌జెయుపి కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల చక్కని అవగాహన ఉన్న వ్యక్తి అన్నారు.

బిసిల నిజమైన నేస్తం కాంగ్రెస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బిసిల పట్ల వైసిపి, టిడిపిలది కపటప్రేమ అని, వారి నిజమైన నేస్తం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు నజీర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 52 క్రితమే కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జిఒ 1793 ద్వారా బిసిలకు విద్యా, ఉద్యోగాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. కాంగ్రెస్ పార్టీ 1993లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో 2008లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా బిసిలకు కూడా ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుత వైసిపి పేరుకు 56 బిసి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, వాటికి విధులు, నిధులు, అధికారాలు లేక ఉత్సవ విగ్రహాల్లా పెట్టారని విమర్శించారు. వైసిపికి బిసిల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అధ్యక్ష పదవి లేదా ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్

వేంపల్లె : బిసిల ఓట్ల కోసం వైసిపి, టిడిపి మొసలికన్నీరు కారుస్తున్నాయని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిల నిజమైన నేస్తం కాంగ్రెస్ ఒక్కటేనని చెప్పారు. 1994లో సచివాలయంలో బిసి శాఖను ఏర్పాటు చేసి అనేక బిసి హాస్టళ్ల, బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు కల్పించిన రిజర్వేషన్లు మూలంగా లక్షలాది మంది బిసి యువత ఉన్నత ఉద్యోగాలు పొందారన్నారు.

ప్రజాసేవలో 'మానవత' ముందుంటుంది

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రజాసేవలో మానవత స్వచ్ఛంద సంస్థ ముందుంటుందని డాక్టర్ నిమ్మకాయల రామాంజనేయులరెడ్డి కొనియాడారు. ఆ సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి అధ్యక్షతన పట్టణంలోని గౌతమ్ హైస్కూల్‌లో ఆదివారం సంస్థ నెలవారి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా డాక్టర్ నిమ్మకాయల రామాంజనేయులరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, ఉచిత వైద్య శిబిరాలు, బాడీ ఫ్రీజర్ వంటి ఎన్నో కార్యక్రమాలు చేయడం హర్షణీ యమన్నారు. తన వంతు సాయంగా లక్ష రూపాయల చెక్కును మానవత సంస్థ కార్యవర్గానికి ఆయన అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన గొర్రె ఓబులేసు అనే పేద విద్యార్థి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువు తున్నాడు. ఆ విద్యార్థి చదువుకు ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని మానవత సంస్థ వారు అందించారు. రూ.లక్ష వితరణ చేసిన నిమ్మకాయల రామాంజనేయులరెడ్డిని మానవత సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. మానవత అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, కార్యదర్శి షర్ఫుద్దీన్, సభ్యులు రాజవర్ధన్ రెడ్డి, రమేష్ నాయుడు, సాంబశివారెడ్డి, షాహిద్, గంగిరెడ్డి పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

ప్రగతిశీల సాహిత్య దీపాధారి రావిశాస్త్రి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రగతిశీల సాహిత్య దీపాధారి రావిశాస్త్రి అని ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ కొనియాడారు. స్థానిక రోటరీ క్లబ్‌లో ఆదివారం రావిశాస్త్రి శత జయంతి సభ ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక, విరసం, అరసం, సాహితీ, స్రవంతి, సాహిత్య సంఘాలన్నీ రావిశాస్త్రి శతజయంతి కమిటీగా ఏర్పడి ఆయన సాహిత్యంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వైవియూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సాహిత్యం రచన అనేది మంచికి హాని చేయకుండా ఉండడం, చెడుకు మేలు చేస్తుందేమో జాగ్రత్త వహించటం ప్రధానంగా ఉండాలన్నారు. సాహిత్యం పని మానవ జీవితాన్ని, విలువలను, సంబంధాలను ఉన్నతీకరించడం అని ఆయన రచనల ద్వారా రుజువు చేశాడన్నారు. రావిశాస్త్రి రచనల్లో అట్టడుగు వర్గాల జీవన చిత్రణ అనే అంశంపై విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ పగలు మనం చూసే అందమైన ప్రపంచం వెనుక దాగి ఉన్న చీకటి ప్రపంచాన్ని రావిశాస్త్రి తన కథా నవలలో తెలియజేశారన్నారు. కథా రచయిత వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ మాయగాళ్లు ఉండే పెద్దవ్యవస్థ ప్రభుత్వమని, వ్యవస్థలో ఉన్న మోసగాళ్లను బోనులో నిలబెట్టే రచనలు చేసిన గొప్ప రచయిత రావిశాస్త్రి అన్నారు. వైవియు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రావి ఒక గౌతముని ఎంత ప్రభావితం చేసిందో ఈ శతాబ్దాన్ని రాచకొండ విశ్వనాథ శాస్త్రి అంత ప్రభావితం చేస్తున్నారని మహాకవి శ్రీశ్రీ మాటలను పుటంకించారు. రచయిత కావాలంటే మనిషిగా మారాలని, సమాజంలోని అట్టడుగు వర్గాల పక్షాన, బాధితుల పక్షాన నిలబడాలని రావిశాస్త్రి జీవితమంతా ఆచరించి చూపాడన్నారు. కార్యక్రమంలో రచయితలు కుప్పిరెడ్డి, పద్మనాభరెడ్డి, కాశి వరపు వెంకటసుబ్బయ్య, జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ పవన్, డాక్టర్ దస్తగిరి, జెవివి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తవ్వా సురేష్, సిఎంఎస్ కన్వీనం పద్మ, సృజన సామాజిక వేదిక శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.




రావిశాస్త్రి రచనలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

శాంతిరథం ప్రదాత సదాశివారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సామాజిక సేవ మూర్తి, శాంతి రథం ప్రదాత సదాశివారెడ్డికి జమ్మలమడుగు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మాధవ గోపాల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో మానవత సేవా సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థకు శాంతి రథాన్ని వితరణ చేసినందుకు గర్వంగా ఉందన్నారు. గుండ్లకుంటలోని ఆయన స్వగృహంలో మాస్టర్ ఆఫ్ సర్జన్ యుఎస్ఎ టి.కె.ఆర్ సదాశివరెడ్డిని సన్మానించారు. ముందుగా సంస్థ చేసిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సదా శివారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తన వంతు సహకారం స్వచ్ఛంద సంస్థలకు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ రామచంద్రారెడ్డి, చైర్మన్ ఓబుల్‌రెడ్డి, బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, నరసింహులు, మిరియాల శివగణపతి పాల్గొన్నారు.



సదా శివారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

క్షౌర వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : నాయీ బ్రాహ్మణ సెలూన్‌లోకి రిలయన్స్ కార్పొరేట్ సంస్థలు రావద్దని క్షౌర వృత్తిదారుల సంఘం జమ్మలమడుగు అధ్యక్షుడు ఎం.గురుప్రసాద్ కోరారు. ఆదివారం క్షౌర వృత్తిదారుల సంఘం (సిఐటియు) జమ్మలమడుగు అధ్యక్షుడు గురుప్రసాద్ తన షాపు వద్ద విలేకరులతో మాట్లాడుతూ రిలయన్స్ కార్పొరేట్ సంస్థలు తమ పొట్ట కొట్టవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు రావాల్సిన రాయితీలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు. సబ్సిడీతో కుర్చీలు, కత్తెరలు, కల్యాణ మండపం, సంగీత వాయిద్యాలు, ఇళ్లు, రేషన్ కార్డ్ మంజూరు చేయాలన్నారు. రేషన్ కార్డ్, ఇళ్లు లేనివారికి ఇల్లు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి తమను అన్ని విధాల ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నర్సయ్య, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి పంట నూర్పిడి ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. సీతారామపురం, చాపాడు, చియ్యపాడు, కుచ్చుపాప, అయ్యవారిపల్లి, రామదాసుపురం, అల్లాడుపల్లె గ్రామాల్లో ఆగస్టు మొదటి వారంలో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తి కావడంతో వరి కోత మిషన్‌ల ద్వారా నూర్పిడి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు 32 బస్తాలు తగ్గకుండా దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. 8బస్తాల ధర రూ.11వేల వరకు పలుకుతున్నాయి. గత ఏడాది ఖరీఫ్‌లో సాగైన దిగుబడి ధాన్యం మాత్రం పుట్టి రూ.18వేలు పలుకుతున్నాయి. మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల వరకు వరి పంటను రైతులు సాగు చేశారు. కుందూ నీటి ఆధారంగా, బోరు బావులు, ఫిల్టర్‌ల ద్వారా రైతులు మళ్లీ సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.



సీతారామపురం వద్ద నూర్పిడి చేసిన వరి ధాన్యం

విద్యార్థి దశ నుంచే దేశసేవ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థి దశ నుంచే దేశసేవ భాగ్యం ఎన్‌సిసిలో కలుగుతుందని స్థానిక జైల్ సూపరింటెండెంట అయ్యావారురెడ్డి పేర్కొన్నారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ఆదివారం 74వ జాతీయ ఎన్‌సిసి 30 (ఎ) డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ అమల్ రాజు ఆహ్వానం మేరకు అయ్యవారురెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎన్‌సిసి కవాతు వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి గొప్పదనాన్ని వివరించారు. చదువుతోపాటు ఎన్‌సిసిలో భాగస్వామ్యమవడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మనం చూపించిన శ్రమకు ఫలితంగా ఆర్మీ, పోలీసు శాఖల్లో మనకే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు. ఇలాంటివి మరెన్నో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫాదర్ అమల్ రాజు, ఎన్‌సిసి సిటిఓ వెలవలి సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల : మాట్లాడుతున్న అయ్యవారురెడ్డి



వేంపల్లె : అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

వేంపల్లె : విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందడుగు వేయాలని ఎన్‌సిసి ఉపాధ్యాయుడు గోపాల్ నాయక్, మిల టరీ జవాన్ కార్తీక్ కుమార్‌రెడ్డి సూచించారు. 74వ జాతీయ ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా ఆదివారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఎన్‌సిసి విద్యార్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రోడ్లపై తిరుగుతున్న వృద్ధులకు అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి క్రమశిక్షణను నేర్పుతుందన్నారు.

సృష్టిలో వెలకట్టలేనిది సేవ ఒక్కటే



వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న తులసిరెడ్డి, సిఐ వెంకటేశ్వరు

ప్రజాశక్తి - వేంపల్లె

సృష్టిలో వెల కట్టలేనిది సేవ చేయడం ఒక్కటేనని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మథర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం 25వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కేక్‌ను తులసిరెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, మానవతా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్యను సత్కరించారు. ఈసందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పేదవాడు అయినప్పటికీ 25ఏళ్లుగా అనాథ వృద్ధులకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి ఆశ్రమాలకు ప్రతి ఒక్క రూ చేయూత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐ వెంకటేశ్వర్లు, ఉషా కిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి మాట్లాడుతూ సేవ చేయ డానికి ధనికులుగానే ఉండాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఉషా కిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆశ్ర మానికి నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. రిటైర్డ్ అధ్యాపకుడు మీగడా రామమునిరెడ్డి రూ.10 వేలు విరాళం ఇచ్చారు. కడపకు చెందిన రామలింగారెడ్డి తన కుమారుడు వర్ధమాను పవన్ బార్గవ్ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. వాసవి జూని యర్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు, శ్రీచైతన్య హైస్కూల్ కరస్పాం డెంట్ చక్రపాణి రెడ్డి, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు కావలి కృష్ణతేజా, పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు మెమ్మెల రాజు, శ్రీకృష్ణ ఆలయ కమిటి చైర్మన్ డేరంగుల రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ధ్యేయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపిని ఆదర్శించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పేద వృద్ధుడు తనకు ఆరోగ్యం సరిగా లేదని, వైద్యానికి డబ్బులేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, అందుకు ఆయన స్పందిస్తూ రూ.10వేలు నగదు అందజేశారు. ఏమైనా అవసరం ఉంటే తమ వద్దకు వస్తే మళ్లీ సాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి నరసింహారెడ్డి, నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి, నన్నేసాహెబ్, పార్టీ అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, కౌన్సిలర్లు షేక్ జిలాని, సత్యం, షేక్ కమల్ బాషా, రజక సంఘం నాయకులు పన్నీటి కాశయ్య, ముస్లిం నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వృద్ధునికి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీంద్ర

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

సచివాలయ ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు రెచ్చగొట్టేలా సచివాలయ ఉద్యోగులను ఉసిగొల్పుతున్న సంఘటనలు ఇటీవల చూస్తూనే ఉన్నామన్నారు. అలాంటి వదంతులు నమ్మవద్దని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే 2020లో రెండవసారి ఉద్యోగాలు పొందిన సచివాలయ ఉద్యోగులకు రెండేళ్ల సర్వీసు పూర్తవుతున్న సందర్భంగా వారి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. బదిలీల విషయంలో ప్రభుత్వం దృష్టి సారించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో పని చేసే కొంత మంది అధికారులు సెలవుల మంజూరులో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించాలని కోరారు. మహిళ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా ఉమెన్స్ గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు హీరామియా మాట్లాడుతూ సంఘ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, ట్రెజరర్ ఉదయ్‌కుమార్, సహాయ కార్యదర్శులు పవన్‌కుమార్, పి.వరప్రసాద్, మహబూబ్ బాషా, గంగయ్య, సురేష్ బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల్లో చర్మ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పోట్లదుర్తి, వలసపల్లె గ్రామాల్లో ఆదివారం రైతులకు ముద్దు చర్మ వ్యాధి (ఎల్ఎస్‌డి) సోకిన పశువులను గుర్తించి, వాటి నివారణకు చికిత్స అందించారు. అనంతరం పోట్లదుర్తి గ్రామంలో డిఎహెచ్‌ఒ డాక్టర్ శారదమ్మ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణమ్మ, పోట్లదుర్తి పశువైద్యాధికారిని డాక్టర్ జ్యోతి, చిలమకూరు పశువైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వర్‌రెడ్డి, వీరపునాయుని పల్లె పశువైద్యాధికారి సునీల్‌కుమార్‌రెడ్డి రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్దు చర్మవ్యాధి కాప్రి వైరస్ ద్వారా ఒక పశువు నుండి మరో పశువుకు గాలి, ఈగలు, దోమల ద్వారా వ్యాపిస్తుందని వివరించారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, చర్మంపై దద్దుర్లు, ఆకలి మందగించుట, కాళ్లవాపులు, గంగోడులు వాపు వంటివి కనిపిస్తాయన్నారు. వీటి నివారణకు జబ్బు వచ్చిన పశువులను ఇతర పశువుల నుండి దూరంగా ఉంచాలని సూచించారు. పశువులశాలలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టీకాలు తప్పనిసరిగా వేయించాలని వారు సూచించారు. జబ్బు లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు డాక్టర్లు సూచించారు. సదస్సులో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ ముందస్తు చర్మ వ్యాధులపై తక్షణ చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులను సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



పశువులను పరిశీలిస్తున్న వైద్యులు, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

'పుట్టా'ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆదివారం ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో మండల టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడప పార్లమెంటు మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా జెండాల మహబూబ్ బాషా నియామకానికి సహకరించిన పుట్టా సుధాకర్ యాదవ్‌ను పూలమాలతో ఘనంగా సత్కరించారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు బొగ్గుల చంద్రఓబుల్ తన కుమార్తె వివాహానికి ఆహ్వానించారు. కొత్తూరు కాశినాయన ఆరాధనోత్సవ కార్యక్రమానికి తప్పక రావాలని గ్రామ నాయకులు పుట్టాను కోరారు. ఈ కార్యక్రమానికి ఆర్థికసాయం అందజేసేందుకు పుట్టా అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, రామానాయుడు, కమలాపురం గౌస్, రమణ, దామోదర్‌రెడ్డి, తుట్టే రాము యాదవ్ పాల్గొన్నారు.



పుట్టాను సన్మానించిన మండల టిడిపి నాయకులు

మైదుకూరు : మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్‌ను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడును గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆదివారం జాండ్లవరం గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర నాయకుడు రామచంద్ర నాయుడు, మైదుకూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్ నాయుడు సత్కరించారు. కార్యక్రమంలో మైదుకూరు మండల టిడిపి అధ్యక్షుడు భీమయ్య, మండల నాయకులు, తెలుగు యువత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రెయిన్ బో స్కూల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని రెయిన్ బో పాఠశాలలో ఆదివారం కడపకు చెందిన శ్రీనివాస హాస్పిటల్ యాజమాన్యం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ తవ్వా సుధాకర్‌రెడ్డి సహాయ సహకారాలు అందించారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

వరి పంటలో తెగుళ్లు అధికంగా ఉన్నా యని, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జాన్సన్ సూచించారు. మండల పరిధి లోని సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో పాముపొడ, పచ్చదోమ అధికంగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎక్సా కోనజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి, నెగిటోవా 80 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పంటల సాగు ప్రారంభంలో విత్తనశుద్ధి చేసుకోవడం వలన తెగుళ్ళను నివారించుకోవచ్చునన్నారు. ప్రస్తుతం ఉన్న తెగుళ్ళతోపాటు మెడ విరుపు సోకితే భీమ్ పిచికారి చేయాలని సూచించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్, రైతులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న శాస్త్రవేత్త జాన్సన్

ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు

- జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అధికార పార్టీ నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొడు తున్నారని జమ్మలమ డుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆరోపించారు. నగర పంచాయతీ పరిధి లోని ముద్దనూరు రోడ్డు జడ్‌పి ఉన్నత పాఠశాల వద్దనుంచి ఆదివారం ఆయన బాదు డేబాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డికి యువకులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వారితో కలిసి ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అడ్డదారిలో అధికార పార్టీ నాయకులు తమ జేబులు నింపుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల పార్టీ బాధ్యులు మోహన్‌రెడ్డి, పెద్దశేట్, లాడ్జి అంకిరెడ్డి, బయపురెడ్డి, సంజీవరెడ్డి, రమేష్‌రెడ్డి, కొండారెడ్డి, మల్లేష్, చాంద్‌బాషా, టైలర్ మాబు, సంతోష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుంకర నాగేశ్వరరావు, అబ్దుల్ షరీఫ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న భూపేష్‌రెడ్డి

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 1990-91 విద్యా సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పూర్వ విద్యార్థిని తోటంశెట్టి శిరీషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పుల్లారెడ్డి, మీనాక్షి, మంగమ్మ, సరస్వతి, శకుంతల, సరోజమ్మను వారు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎ పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యోగాంజనేయులు, జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణయ్య హాజరయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చాలా ఆనందంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి 32ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భంగా మిత్రులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్రెడ్డి మాలినిరెడ్డి, కౌసల్య, పద్మావతి, వెంకటలక్ష్మి, తులసమ్మతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థినులు

గుప్త నిధుల తవ్వకాల ముఠా అరెస్టు

పోరుమామిళ్ల : బి.కోడూరు మండలం తువ్వపల్లి వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. తువ్వపల్లెకు సమీపంలో సగిలేరు కాలువ పక్కన పూజలు చేస్తూ జెసిబితో తవ్వకాలు చేస్తున్న దుండగుల ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా జెసిబి మూడు బైక్‌లను స్వాధీన పరుచుకున్నారు. అరెస్టు చేసిన వారిలో బాలదాసరి ఓబులేసు, వెంకట కొండారెడ్డి, నాగిపోగు భద్రాచలం, రఘురామిరెడ్డి బొజ్జ, చిన్న గోపయ్య కాగా, తువ్వపల్లెకు చెందిన ఒక కీలకమైన వ్యక్తితోపాటు మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సిఐ సురేష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. వీరిపై పలు సెక్షన్ల ప్రకారం బి.కోడూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ చిరంజీవి కేసులు నమోదు చేశారు.



విలేకరుల సమావేశంలో పోలీసులు